హిడింబ పరిహాసం

1

ఆ బ్రాహ్మణకుటుంబంలోని వారంతా తమ మునిపల్లెనించి వేరొక మునిపల్లెకు ప్రయాణమైనారు. ఆ అరణ్య మార్గంలో అలజడి ఏమీ లేకుండా సుఖంగా సాగిపోతున్నారు. వారి కా బాట అంతా సుపరిచితమైనదే! ప్రయాణం చాలావరకు సంతోషంగానే సాగిపోయింది.

ఆ అరణ్యంలో ప్రాతఃకాలవేళ మేలుకొన్న పక్షులు కలకలరవాలతో వారికి స్వాగతం ఇస్తున్నట్లు సందడిచేశాయి. పచ్చిక బయళ్ళలో ఆడుకుంటున్న నెమళ్ళ పింఛాలపై ప్రసరిస్తున్న లేత లేత సూర్య కిరణాలు చిత్ర చిత్రంగా వారి కన్నులకు మిరుమిట్లు గొల్పుతున్నాయి. చెట్ల కొమ్మలపై పరిగెత్తుకుపోతున్న ఉడతల చిరుకుచ్చుల్లా బంగారు వెలుగుల్లో చిన్న చిన్న మెరుపులు మెరిపించాయి! ఆ అరణ్యం అంతా ప్రశాంతంగా సాగిపోతున్న ఆ కుటుంబంవారిసందరినీ అడుగడుగునా పలకరిస్తున్నట్లే స్ఫురించింది.

అయితే వారి సుఖ ప్రయాణం అలా ఎంతోసేపు కొనసాగలేదు! జాము జామున్నర పొద్దెక్కేసరికి ఎండ కొంచెం చిటచిటలాడడం ప్రారంభించింది. అయినా వా రా విషయం అంతగా లెక్క చెయ్యకుండా ఏవో కష్టసుఖాలు మాటలాడుకొంటూ అలాగే సాగిపోతున్నారు.

వారిలో వృద్ధబ్రాహ్మణు డాకుటుంబాని కంతటికీ పెద్ద. ఆయన ధర్మపత్ని ముసలి పండు ముత్తయిదువు. ఆ బ్రాహ్మణుని జ్యేష్ఠకుమారుని

కింకా కౌమార ప్రాయమే! పదహారేళ్లయినా నిండలేదు. రెండవవానికీ ఇంచుమించుగా అదే వయస్సు. మూడవ కుమారునికి ఉపనయనంచేసే ఈడు వచ్చింది. ఏ డెనిమిది ఏళ్ళైనా నిండని ఆ పసివాణ్ణి తల్లి చెయ్యి పట్టుకుని నెమ్మది నెమ్మదిగా నడిపిస్తున్నది. అతడు మధ్య మధ్యన ఆ మహారణ్యంలో కనిపించే చిత్ర విచిత్రాలనుగురించి ఏవేవో వింత వింత ప్రశ్న లడుగుతున్నాడు.

ఇంతలో హఠాత్తుగా వారందరిపైనా ఒక పెద్ద ప్రళయం విరుచుకు పడింది! ఎదట ఒక రాక్షసుడు కాలయముడులా ప్రత్యక్షమైనాడు! నల్లని జుంజురు వెంట్రుకలు, ఎర్రని కళ్ళు, పులి కోరలలాగ కొనలుదేరిన పళ్ళు! అతనిని చూడగానే ఆ పసివాడు హడిలిపోయి తల్లి మాటున దాక్కున్నాడు. ఆ రాక్షసుడు చూడడాని కింకా పదిపదహారేళ్ళ యువకుని లాగే కనిపిస్తున్నాడు. అతని చేతిలోని కరవాలం ఆ లేత ఎండలో తోక చుక్కలా తళతళ లాడింది. మొదట అతడు అందరినీ హతమార్చివెయ్య గలడనే నిశ్చయించారు వారంతా! అందరూ ఒకరొకర్ని పొదువుకుని దిగాలుపడిపోయి ఆ ఆపత్తు గడిచి బయటపడడం ఎలాగా అని ఎంతో ఆందోళన పడ్డారు.

ఆ బ్రాహ్మణ కుమారులతో ఒకరిని తన తల్లి ఆహారంకోసం తీసుకు పోవాలనీ, అందుకే వారి దారి అడ్డగించి నిలబడ్డాననీ ఆ రాక్షస కుమారుడు పెద్దగా అరిచాడు! ఆ మాటలు విని ఆ పండు ముత్తయిదువ వెంటనే స్పృహ తప్పి నేలమీద పడిపోయింది! శీతలోపచారాలు చెయ్యగా చెయ్యగా తిరిగి అతికష్టం మీద సేదదేరింది.

ఆ వృద్ధబ్రాహ్మణుని కా ఘోర విపత్తులో దారి, తెన్ను కనపడ లేదు! లోలోపల ఉబికి ఉబికి ఉప్పొంగిన అతని క్రోధం అంతా అశక్తుని కోపంలా అలాగే లోలోపలే అణిగిపోయింది! చిట్టచివరి కాయన మనస్సులో ఒక ఉపాయం స్ఫురించింది.

తానే ఆ రాక్షసి కాహారమైపోగలననీ, తన కుటుంబం సంరక్షించవలసిందనీ కోరుతూ ఆయన వేయి విధాలుగా ఆ రాక్షస కుమారుణ్ణి బ్రతిమాలుకున్నాడు.

ఆ రాక్షసుడు చిక్కి శల్యమైపోయిన వృద్ధుడు తన కవసరంలేదని కసిరికొట్టేశాడు! అతడు ఆ ముగ్గురు పుత్రులలోను జ్యేష్ఠుణ్ణి తీసుకుపోతానని గట్టిగా పట్టు పట్టాడు. లేకపోతే ఆ కుమారుల నందరిని బలాత్కారంగా తీసుకుపోతానని బెదిరించడం మొదలుపెట్టాడు.

దానిమీద ఆ బ్రాహ్మణు డా రాక్షసుని చేతులు పట్టుకుని బ్రతిమాలుకున్నాడు.

"నాయనా! జ్యేష్ఠ పుత్రుడే నా వంశ ప్రతిష్ఠాపకుడు! నా అనంతరం వైదిక కర్మాధికారి కూడా అతడే. నా కిన్ని నీళ్లు వదలవలసినవాడు కూడా అతడే!"

ఆ పైన ఆ బ్రాహ్మణుని కంఠం గద్గద భారంతో వణికిపోయింది.

రాక్షసునికి ప్రాణం విసిగిపోయింది. తల్లిదండ్రుల ప్రసక్తిలేకుండా కుమారులనందరిని బలాత్కారంగా తీసుకుపోయి ఉండవలసిందనీ, ఇప్పుడిక పశ్చాత్తాప పడి ప్రయోజనం లేదనీ అనుకొన్నాడు. తరవాత ఆ బ్రాహ్మణుని కాగిలిలో అణిగిమణిగి తలదాచుకొన్న జ్యేష్ఠపుత్రుని విడిచివేసి కనిష్ఠ పుత్రుని తీసుకుపోవాలని నిశ్చయించి ఆ రాక్షసుడు వెంటనే అతని జబ్బ దొరకబుచ్చుకొన్నాడు. ఆ పసివాడు, పాపం, తల్లిమాటున తల దాచుకొన్నాడు. తల్లి రాక్షసునితో ఆ పసివానికి బదులుగా తానే అతని తల్లికి ఆహారమైపోతానని అన్నది. కాని అతడు వృద్ధులను తీసుకుపోవడాని కంగీకరించలేదు. పాపం! ఆ వృద్ధమాత అనేక విధాలుగా ప్రాధేయపడింది. అయితే రాక్షసుడు తన మొండిపట్టు విడిచిపెట్టలేదు!

ఇంతలో రెండవ కుమారుడు ధైర్యంగా రాక్షసుని సమక్షంలో నిలిచి "వారి నెందుకు బాధిస్తావు, నన్ను తీసుకుపో" అని ముమ్మందుకు

సాగిపోయాడు. పాపం! తల్లి తిరిగీ రాక్షసుని కాళ్ళమీద పడి రెండవ కుమారునికి బదులుగా తానే వస్తానని అన్నది. రాక్షసుడు వినిపించుకో లేదు. అతడు, ఆ రెండవ కుమారుడు కలిసి వెడుతూ నాలుగు అడుగులు ముందుకు సాగారు. ఆ వృద్ధజనని ఆ ఆఘాతం భరించలేక నిలుచున్న పాటుగా అక్కడే స్పృహ తప్పి పడిపోయింది.

బ్రాహ్మణు డా విధంగా రాక్షసునితో కలిసి వెళ్ళిపోతూన్న రెండవ కుమారుని సమీపించి అతన్ని గుచ్చి కౌగలించుకొని ఎంతో ఆప్యా యంగా ఇలాగన్నాడు:

"నాయనా! మధ్యమా! నీవు ఎప్పుడూ ఎవరికీన్నీ అపకృతిచేసి ఉండలేదు. ఎన్నడూ నీ హృదయంలో అటువంటి సంకల్పమే ఉదయించి ఉండలేదు. సమస్త దేవతలు నిన్ను కంటికి రెప్పలా కాపాడగలరు! వారి అనుగ్రహంవల్ల, ఆ గాయత్రీ మాత కరుణాకటాక్షంవల్ల నీకు ఎటువంటి అశుభము కలగ నేరదు! నావాక్కెన్నడూ వ్యర్థం కాలేదు. ఆ గాయత్రీ మాతను సంస్మరించుకో! తిరిగీ క్షేమంగా వచ్చి మమ్మల్ని అందరినీ కలుసు కుంటావులే! క్షేమంగా వెళ్ళిరా నాయనా!"

అని అతన్ని ప్రశాంతంగా సాగనంపి స్పృహ తప్పి పడిపోయిన ధర్మపత్నికి పరిచర్య చెయ్యడానికై త్వరగా వెనుకకు మరలిపోయినాడు. అక్కడ మిగిలిన కుమారులిద్దరు ఆమెకు పరిచర్య చేస్తున్నారు.

విధికృతం తలుచుకొని ఆ బ్రాహ్మణు డనేకవిధాలుగా దుఃఖిం చాడు. అరణ్యవాసం చేస్తూ, ఆ అరణ్యంలో ఏ విధమైన రాక్షసబాధా లేకుండా సంరక్షిస్తున్న పాండవు లక్కడి కనతిదూరంలోనే ఉన్నా, తమ కుటుంబాని కటువంటి యాతన తప్పలేదే అని ఆ బ్రాహ్మణు డనేక విధాలుగా తన దురదృష్టం నిందించుకొన్నాడు. కొంతసేపటి కాయన భార్య సేదదేరింది. తన మధ్యమ కుమారు డావిధంగా కుటుంబ సంరక్ష ణకై రాక్షసునితో కలిసి వెళ్ళిపోయిన విషయం విని తిరిగీ అనేక విధా

లుగా ఆక్రోశించింది. ఆమెరోదనం కేవలం అరణ్యరోదనమే అయి పోయింది! ఎంతగా కన్ను పొడుచుకొన్నా ఎక్కడా కనుచూపుమేరలో ఆమెకు మధ్యమ కుమారుడు కనిపించలేదు.

ఆ రాక్షసుడు, ఆ బ్రాహ్మణ కుమారుడు అలా కొంతదూరం సాగిపోయేసరికి రెండు యామాల కాలం గడిచిపోయింది.తన తల్లికి భోజన వేళ సమీపించినదని చెప్పి రాక్షసు డా కుమారుణ్ణి కొంతదూరం తొందరగా నడిపించుకుపోయాడు. తరవాత ఆ బ్రాహ్మణ కుమారుడు, సమీపంలో కనిపించే కొలనులో స్నానంచేసి, సంధ్యవార్చి, క్షణకాలం గాయత్రీమాత నుపాసించి, శీఘ్రంగానే తిరిగి వచ్చివేస్తాననీ, దానికి అనుమతి ఇవ్వవలసిందనీ కోరుకొన్నాడు. రాక్షసు డది అతని అంతిమాభీష్టంగా గౌరవించి, స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకొని త్వరగా తిరిగి రావలిసిందని చెప్పి పంపించాడు.

ఆ కొలను కనుచూపు మేరలోనే కనిపించింది. బ్రాహ్మణకుమారుడా సరస్సులో దిగి స్నానం చేస్తూండడము, అతని జపతపాలు అన్నీ దూరంనించి జాగ్రత్తగా కనిపెడుతూనే ఉన్నాడు రాక్షసుడు.

అలా ఒక అరగడియ గడిచిపోయింది. అయినా బ్రాహ్మణ కుమారుడు తిరిగి రాలేదు! 'ఏమైనాడా'అని ఆ రాక్షసుడు తిరిగీ ఆ వైపు పరిశీలించి చూచాడు. ఎందుచేతనో బ్రాహ్మణ కుమారు డక్కడ కనబడలేదు!

అలాగ ఇంకొక అరగడియ కూడా గడిచిపోయింది. రాక్షసు డిక వేచి ఉండలేకపోయాడు. గట్టిగా పిలవాలని అనుకొన్నాడు. కాని అతని పేరేమో తెలియదు. పూర్వం వృద్ధ బ్రాహ్మణు డతన్ని "నాయనా! మధ్యమా!" అని ఆప్యాయంగా సంబోధించిన విషయం అతనికి జ్ఞాపకం వచ్చింది.

వెంటనే "ఓ మధ్యమా!" అని గట్టిగా గొంతెత్తి పిలిచాడు.

ఎవరూ మారు పలకలేదు. ఆ అరణ్యంలో చుట్టూ ఉన్న కొండగుహలు మాత్రం 'ఓ' అని మారు పలికాయి!

ఒక నిమిషం ఊరుకుని తిరిగీ రాక్షసుడలాగే గట్టిగా "ఓ మధ్యమా!" అని పిలిచాడు. ఎవరూ మారు పలకలేదు. గుహా ప్రతిధ్వనులు మాత్రమే వినిపించాయి. రాక్షసుడు తన యావచ్ఛక్తీ వినియోగించి మళ్ళీ గట్టిగా "ఓ మధ్యమా!" అని పిలిచాడు. ఈసారి మాత్రం "ఓయ్! ఓయ్! వస్తున్నాను! వస్తున్నాను!" అని ఒక ప్రత్యుత్తరం వినిపించింది.

ఆ అరణ్యంలో పొదరిండ్ల మధ్యనుంచి దారి చేసుకుని ఒక మహాపురుషుడక్కడ ప్రత్యక్షమైనాడు! అతడు ఆజానుబాహువు. మహా బలశాలి. రాక్షస కుమారుడతన్ని చూచి నిర్ఘాంతపోయాడు!

"ఎవరు నీవు?"

"నేనూ మధ్యముడనే! ఆ బ్రాహ్మణ కుమారునికి బదులు నన్ను తీసుకుపో!"

"ఆ మధ్యము డేమైనాడు?"

"ఏమైతేనేమిలే! నేనూ మధ్యముడనే కదా! నీతో కూడా నన్ను తీసుకుపో!"

"నీ వా మధ్యముడవుమాత్రం కాదు!"

"నేననృతం చెప్పలేదు! మా అమ్మ సంతానములో నేను మధ్యముడనే!"

"ఆమె నామధేయం?"

"కుంతీదేవి!"

"నీ పేరు?"

"భీమసేనుడు!"

"భీమసేనుడా!" అని ఆ రాక్షసకుమారుడు కొంతసేపటివరకూ అలాగే నిర్ఘాంతపోయాడు! కుంతీదేవి, పంచపాండవులు, భీమసేనుడు ఆ పేరులన్నీ అతని చిన్నతనంలో ఎప్పుడో వినిపించినట్లే ఉన్నాయి! కాని అతని కా విషయా లంత స్పష్టంగా తెలియవు. వేళ మించిపోతున్న సమయంలో ఇక అవి తెలుసుకోవాలని కూడా ప్రయత్నించలేదు! భీమసేనునికి కూడా ఆ రాక్షస కుమారుని ముఖం చూచాయగా ఎక్కడో చూచినట్లే గుర్తున్నది. కాని అతని కా విషయం స్పష్టంగా జ్ఞప్తికి రాలేదు! రాక్షస కుమారునికేసి అలాగే చూస్తూ నిలబడిపోయాడు! కొంతసేపటికి ప్రశ్నించాడు :

"నీ పేరెవరు?"

"ఘటోత్కచుడు."

"ఘటోత్కచుడా!"

"అవును! అలా నిర్ఘాంతపోతున్నావేమిటి?"

"ఏమీ లేదుగాని మీ అమ్మగారి పేరేమో అడగవచ్చునా?"

"దానికేమి! ఆమె పేరు హిడింబ!"

ఆ మాట వినేసరికి భీమసేనుడలాగే నిర్ఘాంతపడిపోయాడు. తరవాత అతని ముఖంలో అనేక సందేహచ్ఛాయ లుదయించాయి! క్షణకాలంపాటు అత డేమీ అనలేక అలాగే శిలాప్రతిమలా నిలుచున్నాడు. ఘటోత్కచు డతన్ని తొందరపెడుతూ అన్నాడు :

"మా అమ్మగారికి భోజనవేళ మించిపోతూంది! తొందర తొందరగా నడిచి రా!"

"నేను రాను! నీవే లాక్కుపో!" అన్నాడు భీమసేనుడు బింకంగా!

"ఏం?"

"నా యిష్టం!"

"అయితే నీ పని పట్టిస్తా నుండు!" అని చెప్పి ఘటోత్కచు డాపక్కనే ఉన్న పెద్ద పెద్ద బండిగురివెంద తీగలతో అతని నడుము చుట్టూ గట్టిగా కట్టి బరబరా లాగుకు పోవాలని ప్రయత్నించాడు. కాని ఎంత ప్రయత్నించి శాయశక్తులా లాగినా ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేకపోయాడు! ఘటోత్కచుని కా మిట్టమధ్యాహ్నం ఎండలో ముచ్చె మటలు పోశాయి!

భీమసేను డతన్ని ఎత్తి పొడుస్తూ—

"ఇంతేనా నీ శక్తి!" అన్నాడు.

ఘటోత్కచుడు మళ్ళీ బలంగా లాగాడు! ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు!

"ఏం! ఏమంటావు?" అన్నాడు భీమసేనుడు బింకంగా. ఘటోత్కచుడు తన శక్తి యావత్తూ ఉపయోగించి మళ్ళీ గట్టిగా లాగి, భీమసేనుని బరబరా పదిఅడుగుల దూరం లాక్కుపోయాడు!

భీముడు కొంచెం సంతోషించి "సరే! నేనే వస్తాలే!" అని అతనితో కలిసి అలా ఇంకా చాలా దూరం నడిచిపోయాడు. ఘటోత్కచుడు తిరిగి తన బలం అంతా ఉపయోగించి ఇంకా తొందర తొందరగా రథం లాగినట్టు లాగుతూ అతనిని తన వెనకాలే తీసుకు పోయాడు.

అలా ఇంకా కొంత దూరం పోయేసరికి వారి కొక పర్వతము, దాని చుట్టూరా పెద్ద పెద్ద చెట్లు కనిపించాయి! ఆ చెట్ల నీడల్లో ఆ ప్రాంతంలో ఎక్కడా ఎండపొడ కూడా ప్రవేశించడం లేదు!

అలా ఇంకా కొంచెం దూరం నడిచి వారిద్దరూ పర్వతం తొలిచి నిర్మించిన ఒక పెద్ద పర్వత గృహంలో ప్రవేశించారు! ఘటోత్కచుడు తొందరగా గృహం లోపలికి వెళ్ళి తల్లికి తన సాహస కృత్యం నివేదిం

చాడు. భీమసేనుడా పర్వత గృహంలో ఒక శిలా వేదిక మీద కూర్చు న్నాడు. మరుక్షణంలోనే ఘటోత్కచుని వెంటబెట్టుకుని హిడింబ అక్కడికి వచ్చివేసింది.

లోపలికి వస్తూనే ఆమె ఎదురుగా తీగలతో సతమతమవుతూన్న భీమసేనుని చూచి పక్కుమని ఒక్క నవ్వు నవ్వి, ఘటోత్కచుని ముంగురులు మునివేళ్ళతో దువ్వుతూ, కళ్ళు మెల్లిగా వాల్చి అతనితో అన్నది:

"అయ్యో! వెర్రి తండ్రీ! వీరినా నీవు తీసుకు వచ్చింది?"

"ఏం! ఎవరీయన?"

"అయ్యో! ఈయన సాక్షాత్తూ దైవత మేకదా!"

"ఎవరికి?"

"నాకు; నీకూను!"

"అంటే?"

"ఈయన నీకు పితృపాదులు!"

"నిజంగా?"

పిమ్మట హిడింబ భీమసేనుని పాదాలు ముట్టి—

"ఆర్యపుత్రులకు నమస్కారం!" అన్నది.

దానితో ఘటోత్కచుని అనుమానం తీరిపోయింది! భీము డతన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని కౌగలించుకొన్నాడు! ఘటోత్కచు డాయనకు సాష్టాంగనమస్కారం చేసి తన అపచారాలు మన్నించ వలసిందని వేడుకొన్నాడు.

అటుపిమ్మట ఘటోత్కచుడు హఠాత్తుగా లేచి నిలబడి అడిగాడు: "అమ్మా! మరి ఈపూట మీ భోజనం మాట!"

"అవును సుమా! ఈ ఆనందంలో మరిచేపోయానే!"

"అయితే ఇప్పుడే వస్తానుండు!" అని ఘటోత్కచుడొక అంగలో సింహద్వారం దగ్గిరికి పరుగెత్తుకుపోయాడు!

హిడింబ తొందరగా అతని వెంట వెళ్ళి—

"నాయనా! ఈ పూటకు కందమూలఫలాలు చాలులే!" అన్నది. ఘటోత్కచుడు 'సరే' అని తొందరగా అడవిలోకి వెళ్ళిపోయాడు.

హిడింబ తిరిగి వచ్చి నెమ్మదిగా భీమసేనుని కెదురుగా శిలావేదిక మీద కూర్చున్నది. అత డత్యాశ్చర్యంగా ఆమెకేసి చూసి అడిగాడు:

"ఏమిటి హిడింబా ఈ దారుణం?"

హిడింబ మళ్ళీ కళ్ళు వాల్చి—

"ఈ అరణ్యంలో మీ ధర్మపరిపాలన ఎలా సాగుతున్నదో పరిశీలింతామని ఈ ఎత్తు వేశాను!" అన్నది.

"ఆహా! ఈనాడు రాక్షసులే ధర్మపరీక్షకులైనారే!"

"అవును మరి! మానవులే రాక్షసులైపోయినప్పుడు గత్యంతరం?"

భీమసేను డా మాటతో మరి నోట మాటలేక స్తంభించిపోయాడు!

"అయితే నా పరిపాలన పరీక్షకేనా ఇదంతా?"

"అవును!"

"ఒకవేళ తప్పిజారి ఆ బ్రాహ్మణ కుటుంబానికి అపచారం జరిగి ఉంటే?"

"మరి పరీక్షలో మీ రోడిపోయారన్న మాటే!"

"ఎంతటి సాహసం! సరేగాని, నీవు వేసిన ఈ ఎత్తువల్ల ఆ బ్రాహ్మణ కుటుంబం ఎంతటి అలజడి పాలైపోయిందో కొంచెమైనా గ్రహించావా?"

"సరేగాని ఈ నాలుగేళ్ళనించీ మీ దర్శన భాగ్యం కలగక నాక ళ్ళెలా కాయలు కాచాయో గమనించారా?"

భీమసేనుని కప్పుడు తన తప్పిదం తెలిసింది. పొరపాటే అను కున్నాడు. అయినా హిడింబ అన్న మాటల అంతరార్థం మాత్రం పూర్తిగా అతని కవగాహన కాలేదు. అలాగే ఆశ్చర్యంగా ఆమెకేసి చూసి నెమ్మదిగా అడిగాడు:

"అయితే ఇక్కడికి మా రాక గ్రహించావన్నమాట! ఇదంతా కేవలం పరీక్ష కోసం కాదన్నమాట!"

"ఆ మాట నా నోట అనిపించాలనా మీ ఊహ!"

భీముడు తిరిగీ అలాగే కళ్ళప్పగించి చూస్తూ మరింతగా ఆశ్చర్య పోయాడు. హిడింబ చెప్పిన ఈ మాట కూడా ఎంతవరకూ విశ్వసించాలో అతనికి బోధపడలేదు.

"అయితే హిడింబా! కాకిచేత కబురంపుతే నీ పాదాల దగ్గర వాలి ఉందునే! ఎందుకింతపని చేయించావు!"

"నా కంతటి దైన్యమేల?"

"సరేగాని, పాపం, దీనికోసం మన పసివాడెంత శ్రమపడిపోయాడో గమనించావు కాదుగదా!"

"పోనీ ఈ విధంగానైనా వాడిమీద మీ కింతటి జాలి కలిగింది, అదే పదివేలు! ఇన్నాళ్ళనించీ వాడినయినా చూడాలని ఒక్కమారూ మీకు తోచలేదుగదా!"

"ఇన్నాళ్ళనించీ చూడకపోయినా ఈ వేళతో వాడి దుందుడుకు చేష్టలన్నీ తెలిసిపోయాయిలే!" అన్నాడు భీమసేనుడు. తరవాత ఎంతో ఆప్యాయంగా ఆమెను దగ్గిరికి తీసుకుని కొంటెగా నవ్వుతూ—

"ఎంతటి రాక్షస పరిహాసం!" అన్నాడు.

ఆమె "అదిగో! ఘటోత్కచుడు వస్తున్నాడు!" అన్నది అతని పట్టు విడిపించుకుని.

"అయితే ఈవేళ నీ నరమాంసాహారం మాట!" అన్నాడు భీముడు.

"అయితే - నేను నరమాంసం తింటున్నాననేనా మీ నమ్మకం?"

"కానినా డింతటి విచిత్ర ప్రవృత్తి కలగడం అసంభవం!"

"అంతేనా మీరు గ్రహించింది!-అయితే సరే! మీరు నా సరసనే ఉన్నారు కదా! ఆ ముచ్చట కూడా నేడే తీర్చుకుంటాను!" అన్నది హిడింబ ఏమీ తొణకకుండా!

భీమసేనుడా ఛలోక్తి అంతరార్థం గ్రహించుకొని విరగబడి నవ్వడం మొదలు పెట్టాడు.

అంతలో ఘటోత్కచుడు తీయ తీయని ఫలాలతోను, కంద మూలాలతోను అక్కడ ప్రత్యక్షమైనాడు.